# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- 'ఒక దేశం.. ఒక ఎన్నిక' బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది.
- గడచిన దశాబ్ద కాలంలో పర్యాటకుల సంఖ్య రెట్టింపు అయిందని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు.
- ప్రజలు చట్టాలను గౌరవించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను అరికట్టగలమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.
- పార్లమెంటు ఉభయ సభలలో విపక్షాల ఆందోళనలు ఈ రోజు కూడా కొనసాగాయి.
- ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను యువ క్రీడాకారుడు దొమ్మరాజు గుకేశ్ కైవసం చేసుకున్నాడు.

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సుప్రబల్ జనసేవశ్రీ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌కు గౌరవ ర్యాంక్ ఆఫ్ జనరల్ ఆఫ్ ఇండియన్ ఆర్మీని ప్రదానం చేశారు. నేపాలీ ఆర్మీలో ఆర్మీ స్టాఫ్ చీఫ్‌గా ఉన్న అశోక్ రాజ్ సిగ్డెల్ భారత్-నేపాల్ మధ్య సుదీర్ఘమైన స్నేహబంధాన్ని పెంపొందించడంలో చేసిన కృషికి గానూ ఈ అవార్డు అందుకున్నారు.

==========================

'ఒక దేశం.. ఒకే ఎన్నిక' బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది. న్యూ ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఈ బిల్లుని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, 'ఒక దేశం, ఒకే ఎన్నికపై పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ

ఇచ్చిన నివేదికను సెప్టెంబర్ 18న కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 2019లో 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక దేశం, ఒక ఎన్నిక అనే ఆలోచనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా ప్రతిపాదించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన దశాబ్ద కాలంలో పర్యాటకుల సంఖ్య రెట్టింపు అయిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. న్యూ ఢిల్లీలో ఈ రోజు పర్యాటక రంగంలో సాధించిన అభివృద్ధి గురించి పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ పర్యాటక అభివృద్ధిలో భారతదేశ ర్యాంకింగ్ 39వ స్థానానికి చేరుకుందని వెల్లడించారు. గత 2 సంవత్సరాలుగా పర్యాటక రంగంలో 7 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించామని షెకావత్ తెలిపారు. కాగా, వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న మహా కుంభ్ మేళాలో సాంస్కృతిక గ్రామాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని గజేంద్రసింగ్ షెకావత్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలలో విపక్షాల ఆందోళనల నేపధ్యంలో ఈ రోజు కూడా గందరగోళం ఏర్పడింది. లోక్‌సభ ప్రారంభమైనప్పటి నుండి అధికార, విపక్ష ఎంపీల మధ్య వివాదం సాగింది. దీంతో వరసగా సభ వాయిదా పడుతూ వచ్చింది. అమెరికా వ్యాపారవేత్తతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంబంధాల మీద భారతీయ జనతా పార్టీ సభ్యులు పలు వ్యాఖ్యలు చేశారు. మరో వైపు రాజ్యసభలోనూ ఇదే అంశం మీద అధికార విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలు చట్టాలను గౌరవించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను అరికట్టగలమని కేంద్ర రోడ్డు, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఆ దిశగా సమాజంలో మార్పు రావాలని లోకసభలో ఈరోజు రోడ్డు ప్రమాదాలపై జరిగిన చర్చలో భాగంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తొలిసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు రోడ్డు ప్రమాదాలను 50 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కానీ ఈ ప్రమాదాలు తగ్గకపోగా వాటి సంఖ్య నానాటికీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల సుమారు లక్షా 78 వేల మంది మరణిస్తున్నారని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 44 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను భారత క్రీడాకారుడు దొమ్మరాజు గుకేశ్ సొంతం చేసుకున్నాడు. చైనా క్రీడాకారుడు డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌తో జరిగిన తుది మధ్యలో గుకేశ్ విజేతగా నిలిచాడు. ఈ రోజు జరిగిన 14వ రౌండ్‌లో ఉత్కంఠభరితంగా సాగిన ఆటలో చివరికి విజయం గుకేశ్‌నే వరించింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్న రెండో ఆటగాడిగా గుకేశ్ చరిత్ర సృష్టించాడు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా పలు చోట్ల వివిధ ప్రార్ధనా స్థలాల్లో నిర్వహిస్తున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. వీటి వల్ల ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్న పరిస్థితి ఉందని

పేర్కొంది. అందువల్ల తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఈ రోజు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రసారభారతి, హాకీ ఇండియా మధ్య ఈ రోజు అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో త్వరలో జరగనున్న హాకీ ఇండియా లీగ్ మ్యాచ్ లను దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. కాగా ఇది హాకీ చరిత్రలో అతి పెద్ద మైలురాయిగా ప్రసార భారతి చైర్మన్ నవనీత్ సెహ గల్ అభివర్ణించారు. జాతీయ క్రీడ అయినటువంటి హాకీ మరింతగా ప్రజలకు చేరువ అవుతుందని పేర్కొంటూ..

(వాయిస్ 43 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ - 2047ను రేపు విజయవాడలో విడుదల చేయనున్నారు. స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. దీంతో విజయవాడ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ మళ్లించడంతో పాటూ.. రేపు ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుండి పిసిఆర్ వరకు బందర్ రోడ్ లో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయని పోలీస్ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఆయుర్వేద కాంగ్రెస్ 2024ని ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆయుర్వేద రంగంలో సహకారాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయుర్వేద పద్ధతులలో పరిశోధన, అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఈ రోజు 81,476 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 81,289 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,548 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.87గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.68 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,747 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =